క్లుప్తంగా

నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి



పదోన్నతి పత్రాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డికి చూపుతున్న విమలమ్మ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2గా జి.విమలమ్మ నియమితులయ్యారు. ఆసుపత్రిలో హెడ్ సిస్టర్‌గా ఉన్న ఆమె నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. ఆమె సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మంచి సేవలు అందించాలని, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. నర్సింగ్ సేవలను మరింత మెరుగుపరచాలన్నారు. ఏఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1 ఎస్పీ సావిత్రిబాయి పాల్గొన్నారు.

పారామెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్ పూర్తి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): పారామెడికల్‌కు సంబంధించి 10 కోర్సులకు అడ్మిషన్ కౌన్సెలింగ్‌ను కమిటీ ఆధ్వర్యంలో పూర్తి చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ తెలిపారు. సోమవారం కళాశాలలోని ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొత్తం పది కోర్సులలో అన్ని సీట్లు మెరిట్, రోస్టర్ ప్రకారం భర్తీ చేసినట్లు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఏ కారణం చేతనైనా ఫీజు చెల్లించకపోతే సదరు సీట్లను ఈ నెల 9వ తేదీన జరిగే సెకండ్ కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరిచరణ్, డాక్టర్ టి.సాయిసుధీర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అనిల్‌కుమార్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్.లక్ష్మిప్రసన్న పాల్గొన్నారు.

4న ఆలిండియా నాతియా ముషాయిరా

కర్నూలు(అర్బన్): స్థానిక ఉస్మానియా కళాశాల సమీపంలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 4వ తేదిన రాత్రి 7 గంటలకు ఆలిండియా నాతియా ముషాయిరా నిర్వహించనున్నట్లు సెంట్రల్ మిలాద్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ షఫీ పాషా ఖాద్రీ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంతో పాటు మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రఖ్యాత కవులు హాజరవుతున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఎంతో ఘనంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముస్లింలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పాషా ఖాద్రీ కోరారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కర్నూలు (హాస్పిటల్): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి ఐదుగురితో కూడిన బృందాన్ని నియమించారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలతో పాటు వ్యాధులు ప్రబలిన చోట వైద్య శిబిరాల ఏర్పాటు తదితర కార్యక్రమాలను కంట్రోల్ రూమ్ పర్యవేక్షిస్తుంది.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

కర్నూలు (టౌన్): ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ ఆదేశించారు. ఆయన సోమవారం నగరంలోని బుధవారపేట, బి.క్యాంపు, హౌసింగ్ బోర్డు కాలనీ, సిల్వర్ జూబ్లీ కళాశాల, దేవనగర్ ప్రాంతాల్లో ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డితో కలిసి పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలకు సూచించారు.

నాపరాయి లారీ పట్టివేత



పట్టుబడిన లారీ

కర్నూలు (టౌన్): బేతంచర్ల నుంచి మహారాష్ట్రకు నాపరాయిని తరలిస్తున్న లారీని సోమవారం సాయంత్రం మైనింగ్, విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కర్నూలు నగర శివారులోని నన్నూరు టోల్ ప్లాజా వద్ద లారీని ఆపి తనిఖీ చేశారు. నాపరాయి తరలింపునకు సంబంధించి రాయల్టీ అనుమతులు లేకపోవడంతో రూ.40 వేలు జరిమానా వసూలు చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ వెల్లడించారు.

'మహా' గణపతి



కర్నూలు తుంగభద్రా నదీ తీరంలో రూపు దిద్దుకుంటున్న 63 అడుగుల భారీ గణనాథుడు

కర్నూలు నగరం వినాయక చవితి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. కర్నూలు ఓల్డ్ సిటీ, పెద్ద మార్కెట్ సమీపంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం తుంగభద్రా నది తీరంలో శ్రీ లక్ష్మీ నారసింహ స్వామి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో భారీ గణనాథుడు కొలువు దీరనున్నారు. 2018లో మొదటి సంవత్సరం 55 అడుగులు, 2019లో 65 అడుగులు, 2022లో 60 అడుగులు, 2023లో 56 అడుగులు ఈ ఏడాది 63 అడుగుల భారీ విగ్రహం రూపుదిద్దుకుంటోంది. ఈ విగ్రహం రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద మట్టి వినాయక విగ్రహంగా నిలుస్తోంది. పర్యావరణ హితానికి ప్రతీకగా నిలిచేలా ఏర్పాటు చేస్తున్న ఈ వినాయక విగ్రహాన్ని కోల్‌కతాకు చెందిన శిల్ప కళాకారులు 15 మంది రెండు నెలలుగా శ్రమించి తయారు చేస్తున్నారు. విగ్రహం తయారీ నుంచి నిమజ్జనం వరకు మొత్తం రూ.35 లక్షల వరకు ఖర్చు అవుతుందని భక్త బృందం వ్యవస్థాపకులు కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 7న వినాయక చవితి పర్వదినం నుంచి 10 రోజుల పాటు పూజలు నిర్వహించి 11వ రోజు అంటే ఈనెల 15న సాయంత్రం 5 గంటలకు ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేస్తామన్నారు.

– కర్నూలు కల్చరల్

జన హృదయ నేత డాక్టర్ వైఎస్సార్



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఆరోగ్య ప్రదాతగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం తపించారని గుర్తు చేసుకున్నారు. ఆయన అమలు చేసిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, జలయజ్ఞం పథకాలు దేశానికే ఆదర్శంగా మారాయన్నారు. రైతు బాంధవుడుగా, సంక్షేమ సారథిగా ప్రజల మదిలో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచారని చెప్పారు. కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి,నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, అరుణ, శ్వేతారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల నివాళి

కర్నూలు కల్చరల్: జన హృదయ నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. సోమవారం డీసీసీ కార్యాలయం, స్థానిక స్టేట్ బ్యాంక్ సర్కిల్‌లో డాక్టర్ వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికే ఆదర్శంగా నిలిచేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, నాయకులు షేక్ జిలానీ బాషా, అనంతరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కల్చరల్: నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఆయన సోమవారం జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో జిల్లా చాలా వెనుకబడి ఉందన్నారు. నిర్మాణాలను వేగవంతం చేసి వంద రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. కోడుమూరు, సి.బెళగల్, గూడూరు, ఎమ్మిగనూరు అర్బన్‌లో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేదన్నారు. ఆయా మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడి నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణాల్లో ఎంపీడీఓలు దృష్టి సారించాలన్నారు. హౌసింగ్ కింద 90 పర్సన్ డేస్ కల్పించడంలో పురోగతి సాధిస్తే కుటుంబానికి 100 రోజుల పనిదినాలు కల్పించే లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. పెన్షన్లకు సంబంధించి 2,42,583 మంది లబ్ధిదారులకుగాను ఇప్పటివరకు 2,41,394 మందికి సొమ్ము పంపిణీ చేయడంతో కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

'మా కుటుంబాలను రోడ్డున పడేయొద్దు'



ధర్నా చేస్తున్న మద్యం దుకాణాల కార్మికులు

కర్నూలు (టౌన్): గత ఐదేళ్లుగా పనిచేస్తున్న తమను పనిలోంచి తొలగించి కుటుంబాలను రోడ్డున పడేయవద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జతిన్ చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని విన్నవించారు. తమకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 7వ తేదీన ప్రభుత్వ మద్యం దుకాణాలను బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం ప్రాంగణంలో అసోసియేషన్ సభ్యులు, ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లుగా పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లుగా పనిచేస్తున్న తమను కూటమి ప్రభుత్వం తొలగించాలని చూస్తోందన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి విన్నవించినా ఎలాంటి స్పందన లేదన్నారు. తమను పనిలో కొనసాగించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఎక్సైజ్ శాఖలోని డిపో ఇన్‌చార్జ్ సుధీర్ బాబుకు అందజేశారు. అసోసియేషన్ నాయకులు మనోహర్ రెడ్డి, నాగచంద్రుడు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం



టిడ్కో ఇళ్లకు కట్టిన నగదు తిరిగివ్వాలని కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్‌ను విన్నవిస్తున్న మహిళలు

కర్నూలు (టౌన్): నగరపాలక కార్యాలయానికి ప్రతి సోమవారం వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ ఆదేశించారు. స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 17 మంది అర్జీలను సమర్పించారు. నగరపాలక ఆరోగ్యశాఖాధికారి విశ్వేశ్వర రెడ్డి, డీసీపీ సంధ్యారాణి, ఆర్‌ఓ జునీద్, మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, టి డ్కో అధికారి పెంచలయ్య, డీపీఓ ఉమేష్ పాల్గొన్నారు.

ప్రజలు అర్జీల ద్వారా లేవనెత్తిన సమస్యలు

- టిడ్కో గృహాలకు అనర్హత వచ్చినందున తాము చెల్లించిన డీడీ నగదు వెనక్కి ఇవ్వాలని కస్తూరి నగర్‌కు చెందిన ఈశ్వరయ్య, అశోక్‌నగర్‌కు చెందిన లక్ష్మీప్రసన్న, కొత్తపేటకు చెందిన రామలక్ష్మి విన్నవించారు.
- తమ కాలనీలో మురుగు కాల్వలు, రహదారులు నిర్మించాలని నాగేంద్ర నగర్‌కు చెందిన బ్రహ్మానంద రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి అభ్యర్థించారు.
- తాగునీటి పైపులైన్లు నిర్మించాలని వాసవీ నగర్‌కు చెందిన నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు.
- తమ భూమిని సర్వే చేసి సరిహద్దులు గుర్తించాలని యజమాని వీరకుమార్ విన్నవించారు.
- రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని సోమిశెట్టి నగర్, గౌతమ్ నగర్‌కు చెందిన భీమేశ్వర రెడ్డి, శ్రీనివాసులు కోరారు.

ఈశ్వర వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు



కల్లూరులో నందికోళ్ల ఉత్సవం చేస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు ఈశ్వర వీరభద్ర స్వామి దేవస్థానం శ్రావణమాసం ఉత్సవాల్లో భాగంగా చివరి సోమవారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, మధ్యాహ్నం మహానైవేద్యం, మహా మంగళహారతి, అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నందికోళ్లతో గ్రామోత్సవం కల్లూరు పుర వీధుల మీదుగా చేపట్టారు. ఈ సందర్భంగా వీరశైవలింగాయత్ సమితి అధ్యక్షుడు చంద్రశేఖరప్ప మాట్లాడుతూ అన్యాక్రాంతంలో ఉన్న దేవాలయాల భూములను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, ప్రధాన కార్యదర్శి పెద్ద లక్ష్మయ్య, మల్లయ్య, శంకరయ్య, పవన్ కుమార్, నవీన్ కుమార్, వీరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వినాయక చవితి రోజున మట్టి వినాయకులను పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుకుందామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు ఎస్టేట్‌లోని శ్రీ అవధూత రామిరెడ్డి తాత గోశాలలో మట్టి వినాయకులను పూజిద్దామని పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణ కాలుష్యం తగుతుందన్నారు. కార్యక్రమంలో గోశాల అధ్యక్షులు దాసరి రామచంద్రారెడ్డి, సాయిరామ్ రెడ్డి, గోవిందరాజులు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ధరలు నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం

కల్లూరు: నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సోమవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కె.ఆంజనేయులుకు వినతి పత్రమిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, నాయకులు రామకృష్ణారెడ్డి, మహేష్, నాగరాజు, బిసన్న, నల్లన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు (టౌన్): సచివాలయాలకు వచ్చే ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని నగరపాలక సంస్థ కార్యాలయ మేనేజర్ చిన్నరాముడు ఉద్యోగులకు సూచించారు. ఆయన సోమవారం కొత్తపేటలోని 127, 128, 129, 132 వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, వినతులు, మూమెంట్ రిజిస్టర్‌లను పరిశీలించారు. విధుల నిమిత్తం బయట తిరిగే సిబ్బంది మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. రెవెన్యూ వసూళ్ల ప్రగతిని మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా నవగ్రహ, లక్ష్మీ గణపతి, మూల మంత్ర సహిత చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మాసం సోమవారాన్ని పురస్కరించుకొని శివుడికి అభిషేకం చేశారు. ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో అమావాస్యను పురస్కరించుకొని శ్రీ వారాహి అమ్మవారి హోమం నిర్వహించారు.

పౌష్టికాహారంపై అవగాహన



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కళాశాల చైర్మన్ పెరుగు విజయవర్ధన్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని గీతాంజలి నర్సింగ్ కళాశాలలో సోమవారం మొదటి సంవత్సరం బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు న్యూట్రిషన్ ప్రోగ్రాం నిర్వహించారు. జాతీయ పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకుని పాఠ్యాంశంలో భాగంగా ఫుడ్ మేళా ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ వంటకాలను కళాశాల చైర్మన్ పెరుగు విజయవర్ధన్‌రెడ్డి పరిశీలించి, ఆహారంలో ఉండాల్సిన పోషకాలు కార్బోహైడ్రేట్స్, క్యాలరీస్, విటమిన్స్, మాంసకృతుల నిష్పత్తుల గురించి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వసంతకుమారి, క్లాస్ కో–ఆర్డినేటర్ ఎస్.సురేఖ, అధ్యాపకులు సింధూజ, కె.సురేఖ, మానస పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి సూచించారు. స్థానిక జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధి లోని కమ్మ వీధిలో సోమ వారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులుశెట్టి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, అతిసార వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉషూ క్రీడాకారిణులకు అభినందన

కర్నూలు(టౌన్): నేటి సమాజంలో విద్యార్థి నులు, మహిళలకు ఉషూ లాంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలు అవసరమని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ అన్నారు. గత నెల 28, 29 తేదీల్లో రాజమండ్రిలో జరిగిన సీనియర్ రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో నాలుగు బంగారు, నాలుగు వెండి, రెండు కాంస్య పతకాలు సాధించిన విద్యార్థినులను సోమవారం స్థానిక కళాశాల ప్రాంగణ ంలో ప్రిన్సిపాల్ అభినందించారు. జిల్లా ఉషు సంఘం కార్యదర్శి టీ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సింగిల్ విండో విధానం ఉపసంహరించుకోవాలి

కర్నూలు కల్చరల్: గణేష్ విగ్రహాల పందిర్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానాన్ని ఉపసంహరించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ ఒక ప్రకటనలో కోరారు. పాత పద్ధతిని కొనసాగించాలని కోరారు. మండపాల నిర్వాహకులకు ఎన్‌ఓసీ వల్ల తీవ్ర ఇబ్బందులు ఉంటాయని, ఎలాంటి రుసుము లేకుండా విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.